క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

లక్కిరెడ్డిపల్లె : లక్కిరెడ్డిపల్లిలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో 2024 – 25 సంవత్సరానికి సంబంధించి ఆరో తరగతి ప్రవేశానికి, అలానే ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కేజీబీవీ ప్రిన్సిపాల్ నాగలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు ఫారాలను స్థానిక కస్తూర్బా బాలికల గురుకుల పాఠశాలలో లేదా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని ఆమె తెలియజేశారు. 7, 8, 9 తరగతులలో ఖాళీగా ఉన్న సీట్లకు దరఖాస్తులను కోరుతున్నామన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను స్థానిక పాఠశాలలో అందజేయాలని తెలియజేశారు.

ఉచితంగా వాసెక్టమి శస్త్ర చికిత్స

నందలూరు(రాజంపేట): రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో ఈనెల 18వ తేదీ నుంచి 22వ తేదీ వరకు ఉచితంగా వాసెక్టమి శస్త్ర చికిత్సలు నిర్వహించనున్నట్లు సీహెచ్‌ఓ వెంకటనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ 60 సంవత్సరాలలోపు వయస్సు ఉన్న పురుషులకు పిల్లలు ఉండి, మరలా వారికి పిల్లలు పుట్టకుండా కుటుంబ నియంత్రణ ఆపరేషన్ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు డాక్టర్ శేఖర్, డాక్టర్ శరత్ కమల్ ఆధ్వర్యంలో ఉచితంగా వాసెక్టమి ఆపరేషన్ చేయడం జరుగుతుందన్నారు. ఆపరేషన్ చేయించుకున్న వారికి రూ. 1100లు పారితోషికం, వారిని తీసుకువచ్చిన వారికి రూ. 200లు ఇవ్వడం జరుగుతుందని, కావున ఆసక్తి ఉన్నవారు పై తేదీలలో రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి ఆపరేషన్ చేయించుకోవాల్సిందిగా మండల వాసులను ఆయన కోరారు.

సూచిక బోర్డులేవీ?



సంబేపల్లెలో ప్రమాదకరంగా ఉన్న స్పీడ్ బ్రేకర్

సంబేపల్లె : పోలీస్ స్టేషన్ ఎదుట ప్రకాష్ నగర్ కాలనీ వద్ద జాతీయ రహదారిపై స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో రహదారిలో స్పీడ్ బ్రేకర్ల ఉన్నట్టు ఎలాంటి సూచిక బోర్డులు లేకపోవడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా రహదారి భద్రతా సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

శుభాకాంక్షలు



మధుసూదన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న మండల నాయకులు, కార్యకర్తలు

సిద్దవటం : వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి మేడా మధుసూదన్‌రెడ్డికి సోమవారం మండల వైఎస్సార్‌సీపీ నాయకులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన చేత కేక్‌ను కట్ చేయించారు. కార్యక్రమంలో వైఎస్‌ఆర్‌సీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి ఏకుల రాజేశ్వరిరెడ్డి, జెడ్పీటీసీ ఉపాసి శ్రీకాంత్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ఎన్.శ్రీనివాసులరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ నీలకంఠారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంత వేలంపాట

గాలివీడు : 2024 – 25 ఆర్థిక సంవత్సరానికి గాను గాలివీడు గ్రామ పంచాయతీ కార్యాలయంలో కూరగాయల సంత, పశువుల సంత, బస్టాండు గేటు వేలంపాటను రాయచోటి డివిజినల్ పంచాయతీ అధికారి బి.పార్వతి, పంచాయతీ విస్తరణ అధికారి శేఖర్‌నాయక్, పంచాయతీ కార్యదర్శి సురేష్‌కుమార్, సర్పంచ్ లక్ష్మీదేవిల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. కూరగాయల సంతను రూ.13.51లక్షలకు బాలప్పనాయుడు, పశువుల సంతను రూ.24.30లక్షలు, బస్టాండు గేటును రూ.6.95లక్షలకు గంగాధర్‌నాయుడులు వేలంపాటలో దక్కించుకున్నట్లు అధికారులు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ ప్రచార హోరు

రామాపురం : సంక్షేమ మహారాజుకు మేము సహాయంగా ఉంటామంటూ ఇంటింటి ప్రచారానికి వెళ్లిన నాయకులకు ప్రజలు తెలియజేస్తున్నారు. మండలంలోని 13 గ్రామ పంచాయతీలలో వైఎస్సార్‌సీపీ నాయకులు ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వం చేసిన సంక్షేమం, గ్రామాల్లో అభివృద్ధిని ప్రజలకు తెలియజేశారు. వైఎస్ జగన్‌ను మరోసారి గెలిపించుకుంటే మరింత సంక్షేమం, అభివృద్ధి జరుగుతుందని నాయకులు ప్రజలకు వివరించారు. ఎమ్మెల్యే పోటీచేస్తున్న గడికోట శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీగా నిలుచున్న పీవీ మిథున్‌రెడ్డిలకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ప్రచారంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జనార్దన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథరెడ్డి, జెడ్పీటీసీ వెంకటరమణ, వెంకటసుబ్బారెడ్డి, నాగభూషణ్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

మద్యం పట్టివేత

బి.కొత్తకోట: మండలంలోని బడికాయలపల్లె చెక్‌పోస్టు వద్ద కర్ణాటక మద్యం పట్టుకున్నట్టు సీఐ సూర్యనారాయణ సోమవారం తెలిపారు. మదనపల్లెలో ఉంటున్న వెంకటరమణ (60) కర్ణాటక మద్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా 20 ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని నిందితున్ని అరెస్ట్ చేసినట్టు తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉందని అక్రమ మద్యం రవాణా చేస్తే కఠిన చర్యలుంటాయని చెప్పారు.

నాయకుడిని కాదు మీ సేవకుడినే

- నందలూరు, సిద్దవటం, ఒంటిమిట్ట మండలాల నాయకులతో మేము సిద్ధం–మా బూత్ సిద్ధం
- రాజంపేట వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆకేపాటి అమరనాథరెడ్డి



నందలూరు మండలంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న అమరనాథరెడ్డి



సిద్దవటం: నాయకులకు కిట్లను అందజేసిన ఆకేపాటి అమర్‌నాథరెడ్డి

నందలూరు(రాజంపేట) : 40 ఏళ్లుగా రాజకీయాలలో ఉంటూ ముందుకు నడుస్తున్న తాను ఏనాడు నాయకుడు కాదని ప్రజా సేవకుడినే అని రాజంపేట వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆకేపాటి అమరనాథ్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీలోని అరవపల్లె షాదీఖానాలో వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షులు అన్నం నాగేంద్ర మూర్తి అధ్యక్షతన మేము సిద్ధం మా బూత్ సిద్ధం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆకేపాటి మాట్లాడుతూ పదవిలో ఉన్నా లేకున్నా పార్టీ నియమాలకు కట్టుబడి ముందుకు నడిచే వ్యక్తినని, గత ఎన్నికల్లో అధిష్టానం మేడా మల్లికార్జున రెడ్డికి టికెట్ కేటాయించగా ఆయనకు పూర్తి మద్దతు ప్రకటించి అత్యధిక మెజార్టీతో గెలిచేందుకు కృషి చేశానన్నారు. జగన్ ప్రజాబలం చూసి ప్రతిపక్షాలన్నీ ఏకమయ్యాయని, వైఎస్సార్‌సీపీ కుటుంబ సభ్యులందరూ ఏకతాటిపై నడిచి మళ్లీ వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రిని చేసుకునేలా కృషి చేయాలని కోరారు. ప్రజా సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఘనత దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డిదేనని, ఇప్పుడు ఆయన తనయుడు జగన్‌మోహన్‌రెడ్డి మరో రెండు అడుగులు ముందుకు వేసి మరెన్నో ప్రజా సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని చెప్పారు. ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ మండల వ్యాప్తంగా వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఎక్కువ మెజార్టీ వచ్చేందుకు అందరూ కలిసికట్టుగా సైనికుల్లా పోరాడాలని పిలుపునిచ్చారు. అనంతరం బూత్ కమిటీ సభ్యులకు కిట్లను అందజేశారు. కార్యక్రమంలో నాగిరెడ్డిపల్లె సర్పంచ్ జంబు సూర్యనారాయణ, ఆకేపాటి అనీల్‌కుమార్‌రెడ్డి, జి.వెంకటసుబ్బారెడ్డి, భూమన శివశంకర్ రెడ్డి, ఎస్.గోపిరెడ్డి, ఎస్.సుధాకర్, ఎం.సురేఖ, జి.నరసింహారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ కలీమ్, జి.త్రినాథ్, ఏ.సౌమిత్రి, పి.గ్రీష్మంత్ రెడ్డి, పి.మాధవి, ఏ.మధుయాదవ్, ఉప సర్పంచ్ ఇబ్బు, నాయకులు, బూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైఎస్‌ఆర్‌సీపీతోనే ముస్లిం, మైనార్టీలకు భద్రత

సిద్దవటం : రాష్ట్రంలో ప్రజా సంక్షేమ పథకాలు మరోసారి అమలు కావాలంటే వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కావాలనే నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని రాజంపేట వైఎస్‌ఆర్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి మేము సిద్ధం, మా బూతు సిద్ధం కార్యక్రమంలో కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. సిద్దవటం మండలంలోని మాధవరం–1 గ్రామ శివారులోని శ్రీ కనక దుర్గా కల్యాణ మండపంలో సోమవారం మేము సిద్ధం మా బూత్ సిద్ధం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆకేపాటి మాట్లాడుతూ పేద ప్రజలను ఆర్థికంగా బలోపేతం చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే అన్నారు. బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీలు కూటమిగా ఏర్పడి ప్రజల్లోకి వస్తున్నారని, ముస్లిం, మైనార్టీలకు భద్రత ఉండాలంటే వైఎస్‌ఆర్‌సీపీకి ఓట్లు వేయాలని పిలుపునిచ్చారు. తమ పార్టీ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల వర్గాలకు చెందిన పార్టీ అని అందుకే తాము ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేస్తున్నామన్నారు. రాజు బలంగా ఉంటే శత్రువులంతా ఏకమవుతారని, సీఎం వైఎస్ జగన్‌ను ఢీ కొనేందుకు ప్రతిపక్షాలు ఒక్కటయ్యాయని తెలిపారు. పేదలకు, ధనికులకు మధ్య జరిగే సంగ్రామంలో వైఎస్‌ఆర్‌సీపీ పేదల పక్షాన ఉంటుందన్నారు. ప్రజల కోసం వైఎస్ జగన్ 128 సార్లు బటన్ నొక్కారని ఆయన కోసం రెండు సార్లు ఒకటి ఎంపీ అభ్యర్థికి, ఇంకొకటి ఎమ్మెల్యే అభ్యర్థినైన తనకు ఫ్యాన్ గుర్తుపై నొక్కి భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. తాను ఎల్లవేళల ప్రజా సేవకే పాటుపడతానని అన్నారు. అనంతరం రెండు మండలాల బూత్ కమిటీ కన్వీనర్‌లకు మేము సిద్ధం, మా బూత్ సిద్ధం కిట్లను అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, గృహ నిర్మాణాల శాఖ రాష్ట్ర డైరెక్టర్ ఆకేపాటి వేణుగోపాల్‌రెడ్డి, వైఎస్‌ఆర్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి ఏకుల రాజేశ్వరిరెడ్డి, నియోజకవర్గ జేసీఎస్ కన్వీనర్ సుధాకర్, జెడ్పీటీసీ శ్రీకాంత్‌రెడ్డి, వైస్ ఎంపీపీ శ్రీనివాసులరెడ్డి, రెండు మండలాల వైఎస్సాసీపీ నాయకులు, డైరెక్టర్‌లు, సర్పంచ్‌లు ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ బయారెడ్డి

రాయచోటి అర్బన్ : వేసవిలో ప్రజల తాగునీటి ఎద్దడిని తీర్చేందుకు మరిన్ని చలివేంద్రాల ఏర్పాటు చేయాల్సిన అవసరమం ఉందని వైద్యుడు బయారెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలో ఎస్ ఎన్ కాలనీలోని సాయినాథ్ మెన్స్‌వేర్ వద్ద లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రోజుకు 4 నుండి 5లీటర్ల మంచినీరు సేవించని పక్షంలో ప్రజలు వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. ఈ విషయాన్ని అందరూ గుర్తెరిగి పట్టణంలోని పలుకూడళ్లలో మరిన్ని చలివేంద్రాలు ఏర్పాటు చేసేలా ఔత్సాహికులు ముందుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షులు మహమ్మద్, నాగార్జునాచారి, చాన్ బాషా, సభ్యులు వెంకట్రామిరెడ్డి, శివారెడ్డి, వెంకటచలపతి, భాను, అనిల్‌శెట్టి, నందిని ట్రావెల్స్‌నాయక్, దాత నరేంద్ర కుమార్ శెట్టి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కల్యాణం

పెద్దతిప్పసముద్రం: అరుద్ర నక్షత్రం సందర్భంగా సోమవారం స్థానిక ప్రసన్న విరూపాక్షేశ్వర స్వామి ఆలయంలో శివ పార్వతుల కల్యాణోత్సవం కనుల పండుగగా నిర్వహించారు. శివాలయం సేవకులు సనగరం పట్టాభిరామయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన కల్యాణోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు.

ప్రచార పర్వానికి అనుమతులు తప్పనిసరి

- అనుమతుల్లేకుంటే పార్టీలపై చర్యలు
- వివరాలు వెల్లడించిన ఎన్నికల అధికారి మోహనరావు



రిటర్నింగ్ అధికారి మోహనరావు

రాజంపేట : రాజకీయ పార్టీలు తమ ప్రచార పర్వానికి అనుమతులు తీసుకోవడం తప్పనిసరి అని రాజంపేట రిటర్నింగ్ ఆఫీసర్, రెవెన్యూ డివిజనల్ అధికారి మోహనరావు స్పష్టం చేశారు. సోమవారం తన ఛాంబర్‌లో ఆయన మాట్లాడుతూ ఊరేగింపులు, సభలకు డీఎస్పీ అనుమతి ఉండాలన్నారు. తాత్కాలికంగా ఏర్పాటు చేసుకునే పార్టీ కార్యాలయానికి స్థానిక డీఎస్పీ, వ్యయ పరిశీలకుల వారి అనుమతి తీసుకోవాలని చెప్పారు. వాహనం ఉపయోగించుకునేందుకు రిటర్నింగ్ అధికారుల అనుమతి ఉండాలన్నారు. లౌడు స్పీకర్‌తో రోడ్ల కూడలిలో మీటింగ్‌లు, స్టేజీ, బారికేడ్ల నిర్మాణానికి స్థానిక డీఎస్పీ వారికి అనుమతి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. లౌడు స్పీకరు లేకుండా మీటింగ్ నిర్వహణకు స్థానిక ఎస్‌డీపీఓ, వ్యయ పరిశీలకుల అనుమతి తీసుకోవాలని సూచించారు. ఇంటింటి ప్రచారం, ర్యాలీ నిర్వహణ తదితర వాటికి పోలీసు అనుమతి తీసుకోవాలన్నారు. జిల్లా పరిధిలో తిరిగి ప్రచార వాహనాలకు కలెక్టర్, పూర్తి అసెంబ్లీ ఏరియాలో తిరిగే వాహనానికి, అసెంబ్లీ ఏరియా పరిధిలో తిప్పే ప్రచార రథాలకు రిటర్నింగ్ అధికారి అనుమతి ఉండాలని తెలియేశారు. కరపత్రాలు పంపిణీ కోసం వ్యయ పరిశీలకుల అనుమతి, బ్యానర్ల, జెండాల ప్రదర్శనతోపాటు పోస్టర్లు, ఫ్లెక్సీలు, హోర్డింగులు, కటౌట్ల ఏర్పాటుకు డీఎస్పీ వద్ద అనుమతి తీసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో, సువిధ యాప్ ద్వారా, ప్రత్యక్షంగా, ఎన్నికల రిట్నరింగ్ అధికారుల వారి కార్యాలయంలో అనుమతుల కోసం ఎం.సుజాత(9885144182), సరస్వతి (9494033369)లను సంప్రందించాలని రాజంపేట నియోజకవర్గం(125) రిటర్నింగ్ అధికారి కోరారు.

నియామకం



పెంచలయ్య, ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి

రాజంపేట రూరల్ : జిల్లా వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శిగా రాజంపేటకు చెందిన బొజ్జా పెంచలయ్య నియమితులయ్యారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశానుసారం పార్టీ కార్యాలయం నుంచి ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యినట్లు ఆయన తెలియజేశారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలియజేశారు.

విగ్రహాలకు ముసుగులు

రామాపురం : ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ప్రధాన ప్రాంతాల్లో ఉన్న నాయకుల విగ్రహాలకు ముసుగులు తొడిగారు. మండల కేంద్రంలోని మూడు రోడ్ల కూడలిలోని దివంగత వైఎస్సార్ విగ్రహానికి, హసనాపురం గ్రామంలోని ఎన్టీఆర్ విగ్రహానికి, కార్యాలయాల్లోని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చిత్రపాటాలను తొలగించారు. అంతేకాకుండా మండలంలోని అన్ని గ్రామాల పరిధిలో ఫ్లెక్సీలు, బ్యానర్లు తొలగించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎవరు ఫ్లెక్సీలు, బ్యానర్లు కట్టరాదని అధికారులు హెచ్చరించారు.

శుభాలు వర్షించే వసంతం రంజాన్

- ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి



ఇఫ్తార్ విందును వడ్డిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి అర్బన్ : శుభాలు, సిరులు కురిపించే వరాల వసంతం రంజాన్ అని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ముస్లిం, మైనార్టీలకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. విందులో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ముస్లిం మతపెద్దలు, మైనార్టీలతో కలసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇఫ్తార్ పుణ్యకార్యక్రమన్నారు. ముస్లిం, మైనార్టీల సంక్షేమానికి జగన్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. అల్లాహ్ దయ, ఆశీస్సులతో ప్రజలంతా సుఖశాంతులతో సుభిక్షంగా ఉండాలన్నారు. పేదవాడి ఆకలి విలువను తెలుసుకోవడమే రోజా ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్‌బాషా, వైస్ చైర్మన్ ఫయాజుర్ రహిమాన్, జెడ్పీటీసీ వెంకటేశ్వరరెడ్డి, వైఎస్‌ఆర్‌సీపీ నేతలు బేపారి మహమ్మద్‌ఖాన్, రౌనఖ్‌హుస్సేన్, జాకీర్, ఇర్ఫాన్, ఫయాజ్ అహమ్మద్, ఆసిఫ్‌అలీఖాన్, షబ్బీర్, సాదక్‌అలీ, రియాజ్, రిజ్వాన్, వెంకట్రామిరెడ్డి, రియాజుర్, నవరంగ్ నిస్సార్, గౌస్‌ఖాన్, మాజీ కో–ఆప్షన్ జాఫర్‌అలీ ఖాన్, మాజీ జెడ్పీటీసీ హసన్‌బాషా, గువ్వల బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం, నాటుసారాపై పటిష్ట నిఘా



ఎస్‌ఈబీ సీఐ వైవీ పవన్‌కుమార్

రాజంపేట : రాజంపేట నియోజకవర్గంలోని నందలూరు, రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గంలోని పెనగలూరు, పుల్లంపేట మండలాల్లో అక్రమ మద్యం, నాటుసారాల తయారీపై నిఘాను పటిష్టం చేశామని రాజంపేట ఎస్‌ఈబీ సీఐ వైవీ పవన్‌కుమార్ అన్నారు. సోమవారం తన చాంబరులో ఆయన మాట్లాడుతూ తమ పరిధిలోని ప్రాంతాల్లో ఎన్నికల నియామవళిని పటిష్టంగా అమలు చేస్తామన్నారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలోని పుల్లంపేట, పెనగలూరు మండలాల్లో క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నామని చెప్పారు. మద్యం అక్రమ నిల్వలు, బెల్టుషాపులు అమ్మకాలను అరికట్టేందుకు పకడ్బందీగా చర్యలు తీసుకోవడం జరుగుతోందన్నారు. మారుమూల పల్లెపై సైతం ఎస్‌ఈబీ ప్రత్యేక నిఘా ఉంచిందన్నారు. గతంలో అక్రమ మద్యం రవాణా, నాటు సారా తయారీ చేస్తూ పట్టుబడ్డ వారిపై నిఘా ఉంచామని పేర్కొన్నారు. అలానే రాజంపేట నియోజకవర్గంలో రాజంపేట రూరల్, రాజంపేట టౌన్, నందలూరు మండలాల్లోనూ ఎస్‌ఈబీ నిరంతరం తనిఖీలు చేయడంతోపాటు పట్టుబడిన వారిపై కఠిన చర్యలు నమోదు చేస్తామని హెచ్చరించారు. మద్యం కొనుగోలు విషయం ఒక వ్యక్తి మూడు బాటిళ్ల కన్నా ఎక్కువ ఉండరాదని సూచించారు. జిల్లా సరిహద్దుల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తామన్నారు. అక్రమ మద్యం, నాటుసారా తయారీ జరుగుతుంటే సమాచారం ఇవ్వాలని ప్రజలకు తెలియజేశారు.

ఇంధన పొదుపు.. ఆదాయానికి మలుపు

పీలేరు రూరల్ : ఆర్టీసీలో ఇంధన పొదుపు.. ఆదాయానికి మలుపు అని డీఎం కుమార్ అన్నారు. సోమవారం స్థానిక ఆర్టీసీ గ్యారేజ్‌లో ఆదర్శ ఉద్యోగులకు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరిలో అత్యంత మెరుగైన ఇంధన పొదుపు, ఆదాయం సాధించిన సిబ్బందికి అభినందనలు తెలిపి క్యాష్ అవార్డులు అందజేశారు. క్యాష్ అవార్డులు అందుకున్న వారిలో డి.టి. రెడ్డి, ఇ. గోవిందు, కండక్టర్లు ఎస్.ఎస్. చంద్ర, నిర్మల లకు బహుమతులు ప్రదానం చేశారు. వీరిని మిగతా ఉద్యోగులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

ఇంటింటి ప్రచారం.. గ్రామాల్లో కోలాహలం



పూలుకుంటలో ప్రచారంలో నాయకులు

గాలివీడు : రాష్ట్ర ప్రజలకు జగనన్న ప్రభుత్వం అండగా నిలిచిందని, ప్రతి ఒక్క కుటుంబం వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి జగనన్నను ఆశీర్వదించాలని మండల వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ సుదీప్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక, మండల నాయకులతో కలిసి పూలుకుంట గ్రామంలో ఇంటింటి ప్రచారంలో ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డిలకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం 58 నెలల పాలనలో అన్ని వర్గాలకు ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన నేతల మాయమాటలు నమ్మి మోసపోవద్దన్నారు. పేద ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేసిన పథకాలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ జల్లా పద్మావతమ్మ, వైస్ ఎంపీపీ యదుభూషన్‌రెడ్డి, జెడ్పీటీసీ ఖాదర్‌మొహిద్దిన్, వైఎస్సార్‌సీపీ నాయకులు గుమ్మా అమరనాథరెడ్డి, సర్పంచ్‌లు ఉమాపతిరెడ్డి, మాజీ సర్పంచ్ హరినాథరెడ్డి, చెన్నకేశవరెడ్డి, ఎంపీటీసీ చంద్రప్రకాష్ రెడ్డి, నారాయణ, ఉప సర్పంచ్ మన్సూర్, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటనారాయణరెడ్డి, జనార్దన్‌రెడ్డి, మహదేవరెడ్డి, సుబ్బారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థుల ప్రత్యేక శిబిరం




గ్రామంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న దృశ్యం

ఓబులవారిపల్లె : ఉద్యాన కళాశాల అనంతరాజుపేట ఎన్‌ఎస్‌ఎస్ వారి ఆధ్వర్యంలో సోమవారం సున్నపురాళ్లపల్లి గ్రామంలో సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కెఎం యువరాజు మాట్లాడుతూ మార్చి 18వ తేదీ నుంచి సున్నపురాళ్లపల్లి గ్రామంలో జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో భాగంగా ఉద్యాన కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు గ్రామాలలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. వారం రోజులపాటు జరిగే ఈ శిబిరంలో వలంటీర్లు రక్తదానం, వైద్య శిబిరం, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారి చేసే విధానం, రైతులకు కలుపు నివారణపై అవగాహన కల్పిస్తారన్నారు. అదే విధంగా జాతీయ సేవా పథకం ప్రాముఖ్యత, వివిధ సేవా కార్యక్రమాలు గురించి గ్రామస్తులకు వివరించారు. గ్రామంలో సేవా కార్యక్రమాలు నిర్వహించడం సంతోషంగా ఉందని ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ జి.శారద, యశ్వంత్ కుమార్, ఎన్‌ఎస్‌ఎస్ డాక్టర్ వై.దీప్తి కిరణ్, డాక్టర్ ఎ.నిశ్చల, గ్రామస్తులు, ఉద్యాన కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

సారా విక్రయిస్తున్న మహిళ అరెస్ట్

మదనపల్లె: అక్రమంగా సారా విక్రయిస్తున్న మహిళను అరెస్టు చేసినట్లు టూ టౌన్ ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు. ఆదివారం రాత్రి పట్టణంలోని ఎస్టేట్ శివాజీ నగర్ లో సురేష్ నాయక్ భార్య మూడే రాజమ్మ (35) తన ఇంటి వెనక వైపున సారా విక్రయిస్తుండగా, అదుపులోకి తీసుకున్నామన్నారు. ఆమె వద్ద నుంచి ఐదు లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించినట్లు చెప్పారు.

నేటి నుంచి గట్టు వెంకటరమణస్వామి తిరునాల



ప్రత్యేక అలంకరణలో గట్టు వెంకటరమణస్వామి

రామసముద్రం: మండలంలోని చెంబకూరులో వెలసిన శ్రీగట్టు వెంకటరమణస్వామి తిరునాల మంగళవారం అంకురార్పణతో ప్రారంభంకానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 19న అంకురార్పణ, 20న ధ్వజారోహణం, సూర్యప్రభోత్సవం, 21న సింహ వాహనం, 22న శేష వాహనం, 23న హనుమంత వాహనం, 24న గజవాహనం, 25న కళ్యాణోత్సవం, గరుడోత్సవం, 26న రథోత్సవం, 27న దోపోత్సవం, 28న వసంతోత్సవం, ధ్వజా ఆవరోహణం 29న పూలంగిసేవ, 30న శయనోత్సవం, 31న సుప్రభాత, సేవ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు గ్రామ పెద్దలు, కార్యనిర్వాహకులు మాట్లాడుతూ స్వామివారి సేవలో భక్తులు పాల్గొని స్వామివారి సేవలో భక్తులు పాల్గొని స్వామికృపకు పాత్రులుకావాలని కోరారు.

కల్పవృక్ష వాహనంపై శ్రీనారసింహుడు



కల్పవృక్ష వాహనంపై స్వామివారి ఊరేగింపు దృశ్యం

గుర్రంకొండ: మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీ నరసింహస్వామిని కల్పవృక్ష వాహనంపై వైభవంగా ఊరేగించారు. స్వామి వారి బ్రహోత్సవాల్లో భాగంగా మూడవ రోజైన సోమవారం వేకువ జామునే మూలవర్లకు శుద్ధితో మాల సేవ నిర్వహించారు. ఆలయంలో స్వామి ఊంజల్‌సేవ కానిచ్చారు. వాహన మండపంలో స్వామి వారి వాహనాన్ని రంగురంగుల పుష్పాలతో అందంగా అలంకరించారు. స్వామివార్లు కల్పవృక్ష వాహనంపై కొలువుదీరి గ్రామపుర వీధుల్లో మేళతాళాలతో ఘనంగా ఊరేగారు. అనంతరం సింహవాహనంపై స్వామి వారిని కొలువుదీర్చి గ్రామపుర వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. బ్రహోత్సవాల్లో భక్తులు, ప్రజలు పెద్ద ఎత్తున ఆలయానికి తరలి వచ్చి స్వామివారి సేవలు తరిస్తున్నారు. ఉదయం నుంచి సాయంకాలం వరకు స్వామివారి ఉత్సవాల్లో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్నారు. బ్రహోత్సవాలను పురస్కరించుకొని ఆలయాన్ని గ్రామంలోని రోడ్డుకు కిరువైపులా రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. కార్యక్రమంలో టీటీడీ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

పది పరీక్షలు ప్రారంభం



పుల్లంపేట: ఏపీ మోడల్ స్కూల్‌లో పరీక్షా కేంద్రంలోకి వెళ్లేందుకు వేచివున్న విద్యార్థులు



లక్కిరెడ్డిపల్లెలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు



నాగిరెడ్డిపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో..

పది పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు కావడంతో పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులు, వారి తల్లిదండ్రుల రాకతో కోలాహలం కనిపించింది. పరీక్షలకు వచ్చే విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని అధికారులు అన్ని రకాల ఏర్పాట్లు చేశారు. కేంద్రాల వద్ద పోలీసులు 144 సెక్షన్ విధించారు. తొలి పరీక్ష కావడంతో విద్యార్థులు అరగంట ముందే పరీక్షా కేంద్రాలకు వచ్చారు. విద్యార్థుల హాల్ టికెట్లను పరిశీలన చేసి కేంద్రంలోకి అనుమతిచ్చారు. విద్యాధికారులతోపాటు రెవెన్యూ అధికారులు పరీక్షా కేంద్రాల్లో ప్రత్యేక తనిఖీ చేశారు.

– సాక్షి, నెట్‌వర్క్



పెనగలూరులోని మోడల్ స్కూల్ పరీక్షా కేంద్రం వేచివున్న విద్యార్థులు



వీరబల్లెలో పరీక్షా కేంద్రాన్ని పర్యవేక్షిస్తున్న పోలీసులు



ఓబులవారిపల్లె: పరీక్షా కేంద్రంలో తనిఖీలు చేస్తున్న ఉన్నతాధికారి సురేష్



సిద్దవటంలో పది పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

కర్ణాటక మద్యం స్వాధీనం

మదనపల్లె : అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తాలూకా సీఐ ఎస్.శేఖర్ తెలిపారు. ఆదివారం రాత్రి మండలంలోని చీకలబైలు వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా, కర్ణాటక రాష్ట్రం, జిగని తాలూకా, హోలీ మంగళ పోస్ట్, కైలాస హళ్లి కి చెందిన వీరభద్ర కుమారుడు వి మోహన్ కుమార్ (37), వృత్తిరీత్యా డ్రైవర్ కాగా, ఆదివారం కర్ణాటక మద్యం తరలిస్తూ పట్టుబడ్డాడు. నిందితుని వద్ద నుంచి కర్ణాటక కు చెందిన మూడు ఫుల్ బాటిల్స్ (ఒక్కొక్కటి 750 ఎం.ఎల్) విస్కీ మద్యం, నాలుగు బాటిళ్లు (90 ఎం.ఎల్) స్వాధీనం చేసుకున్నామన్నారు.